భక్తజనులను కరుణించి.. కాపాడే కనకదుర్గమ్మ పూజలకు వేళాయింది. దసరా పండగను పురస్కరించుకుని సోమవారం నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు అమ్మవారి ఆలయాలు సిద్ధమయ్యాయి. వాడవాడలా యూత్ అసోసియేషన్లు మండపాలు సిద్ధం చేశారు. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోని ఉద్యోగులు దుర్గా నవరాత్రులు పెద్ద ఎత్తున జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు కోల్‌కతా కళాకారులు తుది మెరుగులు దిద్దుతూ బిజీగా ఉన్నారు.

– సీతంపేట


అక్కయ్యపాలెంలో విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన లలితా పీఠం

దండాలమ్మ.. దుర్గమ్మ

• నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు • రోజుకో అలంకారంలో అమ్మవారి దర్శనం • సిద్ధమైన ఆలయాలు, మండపాలు

శ్రీలలితా పీఠంలో విశేష హోమాలు


లలితా పీఠంలో సిద్ధం చేసిన హోమ గుండం

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో సోమవారం ఉదయం 8.30 గంటలకు అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపనతో ఉత్సవాలు మొదలవుతాయని, లక్ష్మీగణపతి, చండీ హోమాలు జరుగుతాయని చెప్పారు. 23న ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య స్వామి, సర్ప సూక్త హోమం, మన్యుపాశుపత హోమం, 24న ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిర భద్రకాళి హోమం, సుదర్శన హోమం, 25న దత్తాత్రేయ దక్షిణామూర్తి హోమం, 26న లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గమాల హోమం, 27న వారాహిదేవి హోమం, రాజశ్యామల హోమం, 28న మహా సౌర అరుణ హోమం, 29న సరస్వతి దేవి, గాయత్రి దేవి హోమం, 30న కాళీ హోమం, బగళాముఖి హోమం, అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు నవదుర్గా, శ్రీవిద్యా హోమం, 2వ తేదీ దశమి రోజున 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి, చండీ హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం చండీ పారాయణ, మధ్యాహ్నం 3.30 గంటలకు చండీ హోమం, సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. ఈ విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలు..

లలితా పీఠంలో కొలువైన పద్మావతి అమ్మవారు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని కృష్ణసేన్ తెలిపారు. 22న మహాలక్ష్మి, 23న ఆదిలక్ష్మీదేవి, 24న ధాన్యలక్ష్మి, 25న ధైర్యలక్ష్మి, 26న గజలక్ష్మీ దేవి, 27న సంతాన లక్ష్మి, 28న విజయలక్ష్మి, 29న విద్యా లక్ష్మి, 30న ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తారన్నారు.


పూజలందుకోనున్న శ్రీలలితాదేవి

శాంతి స్వరూపిణి ఆలయం సిద్ధం



పాత రేసపువానిపాలెంలో కొలువైన శాంతి స్వరూపిణి దుర్గాదేవి

పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వెనుక గల శ్రీశాంతి స్వరూపిణి దుర్గా ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు దుర్గాదేవికి పంచామృతాభిషేకం, 22న ఉదయం 9 గంటలకు శాంతి హోమం, 29న సాయంత్రం 7.30 గంటలకు విద్యార్థులచే సరస్వతి దేవికి సామూహిక కుంకుమార్చన, 30న ఉదయం 9 గంటలకు సహస్ర నామాలతో సామూహిక కుంకుమార్చన, మధ్యాహ్నం 12.30 గంటలకు మహా అన్నదానం, అక్టోబర్ 3న సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

రోజుకొక అలంకారం..

శాంతి స్వరూపిణి ఆలయంలో దుర్గాదేవి రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 22న బాలత్రిపుర సుందరి, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణ దేవి, 25న కాత్యాయని, 26న మహాలక్ష్మి దేవి, 27న లలితా త్రిపుర సుందరి, 28న మహా చండీ దుర్గాదేవి, 29న సరస్వతి దేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని, 2న రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిస్తారు.

ఆలయాలు, మండపాల్లో పూజలు..


సీతంపేటలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన భారీ పెండాల్

సీతంపేట పార్వతీశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ తెలిపారు. తొమ్మిది రోజులు పార్వతీదేవి రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, ప్రతి రోజూ చండీ హోమం, సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు.

» రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. సీతంపేట రాధాకృష్ణ ఆలయం వద్ద భారీ పెండాల్ సిద్ధం చేశారు. ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది.

శరన్నవరాత్రి శోభ


సీతన్న గార్డెన్స్‌లో కొలువైన కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గమ్మ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్ లో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి, గాయత్రి దేవి, కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సనపల కీర్తి, కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు పది రోజుల పాటు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు


గుమ్మడికాయలో దీపాలు వెలిగించిన భక్తులు

మర్రిపాలెం: మాధవధారలోని మాధవ స్వామి ఆలయంలో కొలువైన కాలభైరవ స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచే ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో గుమ్మడి కాయలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి నెలా అమావాస్య రోజున ఇక్కడ భక్తులు పూజలు నిర్వహించడం విశేషం. జై కాలభైరవా అంటూ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

నేటి నుంచి యువజనోత్సవాలు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23న 11 అంశాల్లో యువజనోత్సవాలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. 22న వక్తృత్వ, వ్యాసరచన, వాద – ప్రతివాద, క్విజ్, రంగవల్లులు, చిత్రలేఖనం, నాటికల విభాగాల్లో, 23న సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, శాస్త్రీయ నృత్యం, జానపద బృంద నాట్యాల్లో పోటీలు నిర్వహిస్తారు. వీటిలో ఏయూ అనుబంధ కళాశాలల జాతీయ సేవా పథక కార్యకర్తలందరూ అర్హులు.

క్లుప్తంగా

చిరు వ్యాపారులను ఆదుకోండి

తాటిచెట్లపాలెం: రోడ్డున పడిన చిరు వ్యాపారులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ విజ్ఞప్తి చేశారు. సీతమ్మధార సాయిబాబా గుడి వద్ద గల పార్కులో ఆదివారం నిర్వహించిన చిరు వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ విశాఖ పరిధిలోని అక్కయ్యపాలెం, గురుద్వారా, సీతంపేట, నరసింహనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుని బతుకుతున్న వారిపై స్మార్ట్ సిటీ పేరుతో జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పోలీసులతో కలిసి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా దౌర్జన్యంగా దుకాణాలు తొలగించి రోడ్డు మీద పడేయడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న చలో జీవీఎంసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చిరు వ్యాపారులకు పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు నిబంధనలను పక్కన పెట్టి చిరు వ్యాపారుల బడ్డీలు తొలగించడం అన్యాయమని, హాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయాల పరిశీలన


రైతుబజార్‌లో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అపర్ణ

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌లో ఆదివారం జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ యలమంచిలి అపర్ణ పర్యటించారు. రైతులు ఏయే ప్రాంతాల నుంచి వస్తున్నారు, ఏమేం పంటలు తీసుకొస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. వైస్ చైర్మన్ వి.చంద్రశేఖర్, యలమంచిలి ప్రసాద్, డైరెక్టర్లు మొల్లి శోభ, నాగులపల్లి లత, మైలపిల్లి తాతారావు, పద్మ, యు.శివశంకర్, లలిత, రైతుబజార్ ఈవో సిహెచ్.కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

'విరామ్' పుస్తకావిష్కరణ


విరామ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ద్వారకానగర్ బీవీకే కళాశాలలో ఆదివారం హిందీ సాహితీవేత్త డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్ల హిందీ అనువాద రచన 'విరామ్' ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 1962లో జరిగిన భారత్, చైనా యుద్ధ సమయంలో, ఆ యుద్ధ నేపథ్యంలో రాసిన కవిత విషయం ప్రస్తావిస్తూ, రెండో ప్రపంచ యుద్ధ ప్రభావం ఆంధ్ర విశ్వవిద్యాలయంపై పడిందని తెలిపారు. హిందీ సాహిత్యకారుడు డాక్టర్ ఎస్.కృష్ణబాబు మాట్లాడుతూ యుద్ధ పరిణామాలను వివరిస్తూ ఆపరేషన్ సింధూర్ విషయాన్ని ప్రస్తావించారు. ఆచార్య పి.కె.జయలక్ష్మి పుస్తక సమీక్ష చేశారు. రచయిత నిర్మలాదేవి మాట్లాడుతూ ప్రముఖ రచయిత అంగర వెంకట కృష్ణారావు రచించిన విరామం నవలకు అనువాదమే విరామ్ అని తెలిపారు. కార్యక్రమంలో మల్లాప్రగడ రామారావు, ఘంటికోట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌తో అప్రమత్తం


డాక్టర్ వాణిని సత్కరిస్తున్న న్యూరాలజీ విభాగం వైద్యులు

మహారాణిపేట: మతిమరుపు (అల్జీమర్స్)తో జాగ్రత్తగా ఉండాలని, తాజాగా మధ్య వయసు వారిలో కూడా మతి మరుపు వస్తుందని కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి అన్నారు. ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఈ క్లాస్ రూమ్‌లో జరిగిన ప్రపంచ మతి మరుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సీఎంఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి అల్జీమర్స్‌పై అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని సత్కరించారు. కార్యక్రమంలో న్యూరాలజీ నిపుణులు డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.కిషోర్ బాబు, డాక్టర్ కె.సత్యారావు, డాక్టర్ ఎం.మధుసూదన బాబు, డాక్టర్ ఎస్.వి.సుందరాచార్య, డాక్టర్ టి.సతీష్ కుమార్, డాక్టర్ సీహెచ్ సుష్మ, కె.మనోజ్ కుమార్, డాక్టర్ హర్షిత పాల్గొన్నారు.

వేగవంతంగా నగర సుందరీకరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


తాటిచెట్లపాలెంలో మీడియన్ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

తాటిచెట్లపాలెం: నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జోన్-5 పరిధి తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు చేపడుతున్న మీడియన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.38 లక్షల జీవీఎంసీ నిధులతో జరుగుతున్న మీడియన్ సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ మార్గంలో రాబోయే రెండు రోజుల్లో ప్రముఖులు నగరానికి వస్తున్నందున పనులు నిలపాలని, బుధవారం నుంచి తిరిగి మొదలుపెట్టి పూర్తిచేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సంపత్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు. జీవీఎంసీ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ భరణి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాల నివారణతోనే ప్రపంచ శాంతి


శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సీతంపేట: ఐఏఆర్‌ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి, గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కె.రవి మాట్లాడుతూ రోజురోజుకూ ఉగ్రవాదంతోపాటు దేశాల ఆయుధ శక్తి కూడా పెరుగుతోందని, దీంతో దేశాలకు ఒకరిపై మరొకరికి నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. దీని ప్రభావం దేశ అభివృద్ధిపై పడుతోందని, మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఐక్య రాజ్య సమితి చురుకైన పాత్ర పోషించాలన్నారు. అనంతరం సభ్యులంతా శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, ప్రజ్ఞాన్ కుమార్, కె.వి.ఎస్.మూర్తి, చాట్ల బాబూరావు, రాజ్‌ధామ్ భిక్షు, బంగార్రాజు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు గురజాడ


గురజాడ, తెన్నేటి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: సాంఘిక సంస్కరణలకు తన జీవితాన్ని అర్పించిన గురజాడ అప్పారావు ఆదర్శనీయుడని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహాకవి గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గురజాడ ఆనాటి సమాజంలో మూఢ నమ్మకాలను తొలగించేందుకు విశేష కృషి చేశారని వివరించారు. తెలుగు సాహిత్య రంగంలో ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం ఇప్పటికీ వన్నె తరగని కావ్యంగా వర్ధిల్లుతోందన్నారు. గురజాడను ఆదర్శంగా తీసుకుని సమాజంలో ప్రజలందరిని సమాన భావనతో చూడాలన్నారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుడు, విశాఖ ఉక్కు కర్మాగారం సాధనకు కృషి చేసిన తెన్నేటి విశ్వనాథం జయంతిని నిర్వహించి నివాళులర్పించారు. క్లబ్ వ్యవస్థాపకుడు ఎస్.బుచ్చయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో గురజాడ కృషిని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యపానం

మందుబాబులు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారు. తాగిన మైకంలో తూగుతూ రోడ్లపైనే పడకేస్తున్నారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులు పేటకు వెళ్లే రహదారిలో ఆదివారం కొందరు మద్యం తాగుతూ 'సాక్షి' కంటపడ్డారిలా..

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



రహదారుణాలు


104 ఏరియాలో ప్రమాదకరంగా రహదారి


కంచరపాలెం కూడలి నుంచి జ్ఞానాపురం వెళ్లే రోడ్డులో వాహనదారుల పాట్లు


కంచరపాలెం రైతుబజారు సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన బీఆర్‌టీఎస్ రహదారి

- మట్టిరోడ్లను తలపిస్తున్న బీఆర్‌టీఎస్ రహదారులు
- చీకటి పడితే ప్రమాదాలు
- మొక్కుబడిగా ప్యాచ్‌వర్కులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంతతో వాహన చోదకులకు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. మరి కొన్ని మార్గాలను మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. –మర్రిపాలెం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి నుంచి కంచరపాలెం కూడలి మీదుగా జ్ఞానాపురం వెళ్లే 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్ కంచరపాలెం రైతుబజారు, నేతాజీకూడలి, శ్యామ్‌నగర్, బాపూజీనగర్ వద్ద రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

- కంచరపాలెం నుంచి 104 ఏరియా ఆశవానిపాలెం, అశోక్‌పార్క్ వెళ్లే రహదారి మీదుగా లోకోషెడ్ వాషింగ్‌లైన్‌కు వెళ్లే ఈ మార్గాల్లో ప్రయాణమంటే వాహనచోదకులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు.
- ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, సుంకరపేట, భవానీగార్డెన్స్, జ్యోతినగర్ మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్, కంచరపాలెం కూడలిలో భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడం, రహదారులు కుదించిపోవడం, అధిక మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలుపుతున్నారు.

గుంతలమయంగా రోడ్లు

మర్రిపాలెం నుంచి కంచరపాలెం వెళ్లే ప్రధాన బీఆర్‌టీఎస్ రహదారుల్లో బ్లాక్ తారు (బీటీ)రోడ్లు కానరావడం లేదు. మూడేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లకు గతేడాది కూటమి ప్రభుత్వంలో అక్కడక్కడ పడిన గోతులు పూడ్చారు. అయితే నాణ్యత లేకపోవడంతో కప్పిన గుంతలు మళ్లీ యధాస్థితికి వచ్చాయి. రాళ్లు తేలి మట్టి రోడ్లను అయితే ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడ్డాయంటూ ప్రజాప్రతినిధులు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంకా భారీ వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

నాడు హడావుడి.. నేడు మౌనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో హడావుడి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నేడు రోడ్లు రాళ్లు తేలుతున్నా... మట్టి రోడ్లను తలపిస్తున్నా ఎందుకు దృష్టి పెట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు నేడు కనిపించక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వెలుగులు అంతంతే

దీనికి తోడు రహదారుల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. చీకట్లో ప్రయాణ సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అవస్థలు



బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారుల్లో గోతులు పడి రాళ్లు తేలాయి. అటుగా రాకపోకలు చేసే సమయంలో వాహనాల తాకిడికి రాళ్ల పిక్కలు లేచి వంటికి తగులుతున్నాయి. కంచరపాలెం కూడలి నుంచి వెళ్లే రహదారుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చీకటి పడితే రాత్రి సమయంల్లో ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయి.

–కె.రాము, దుర్గానగర్, కంచరపాలెం

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం


క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న కేటీబీ అసోసియేషన్ సభ్యుడు శ్రీనుబాబు, వైద్యుడు రాజేష్

గోపాలపట్నం: విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ అన్నారు. కాకానినగర్‌లోని కేటీబీ కళాక్షేత్రంలో విద్య, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ పిల్లలు కోరుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. క్రీడల ద్వారా కూడా అనేక రంగాల్లో మంచి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. రక్షణ రంగంలో డాక్ యార్డు ఉద్యోగులు సేవలు అందిస్తూ ఈ విధమైన సమాజ సేవ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం భరత్‌ను సత్కరించి జ్ఞాపిక అందించారు. ప్రముఖ న్యూరాలజీ వైద్యుడు ఇందాల వెంకట రాజేష్ మాట్లాడుతూ సమాజ సేవ చేయడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని కోరారు. డాక్ యార్డు కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పలు రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.